క్లుప్తంగా

ఆమనగల్లు సభను విజయవంతం చేయండి

మొయినాబాద్‌: ఆమనగల్లులో సోమవారం జరిగే దివ్యాంగులు, వితంతు, చేనేత పింఛన్‌దారుల సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఇన్‌చార్జి మాసానిపేట యాదగిరిమాదిగ కోరారు. ఆదివారం మొయినాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాలు, అన్ని గ్రామాల నుంచి దివ్యాంగులు, వితంతువులు, చేనేత పింఛన్‌దారులంతా తరలిరావాలన్నారు. పింఛన్‌దారుల సమస్యల పరిష్కారంకోసం జరుగుతున్న సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు కొండిగారి మహేందర్‌మాదిగ, నాయకులు శివ మాదిగ, సురేష్‌ తదితరులు ఉన్నారు.

ఘనంగా బ్రూస్‌లీ వర్ధంతి



వర్ధంతి కార్యక్రమంలో కరాటే మాస్టర్లు, విద్యార్థులు

కొందుర్గు: న్యూమాంక్స్‌ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బ్రూస్‌లీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి, బ్రూస్‌లీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాస్టర్‌ రమేశ్‌ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బ్రూస్‌లీ లెజెండ్‌గా నిలిచాడన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు రాజు, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: కాంగ్రెస్‌ కార్యకర్తల జోలికి ఎవరైనా వస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని చిల్కమర్రి గ్రామంలో బోనాల సందర్భంగా కాంగ్రెస్‌ నేత రవీందర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనను ఆదివారం ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన రవీందర్‌రెడ్డి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ పని తాము చేసుకుంటున్న కాంగ్రెస్‌ కార్యకర్తలపై రాజకీయంగా దెబ్బ తీయాలనే ఆలోచనతో దాడులకు దిగితే సహించేది లేదని అన్నారు. పచ్చని గ్రామాలలో రాజకీయ కక్షలు రగిలించేందుకు కొన్ని అల్లరిమూకలు ఇలాంటి ఘతుకాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కురువ మల్లేశ్‌ మేకల పోషణతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. రోజు మాదిరిగా మేకలను శనివారం రాత్రి తన వ్యవసాయ పొలంలోని కొట్టాంలో ఉంచి ఇంటికి మల్లేశ్‌ వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం మంద వద్దకు వెళ్లి చూడగా కుక్కలు దాడి చేసి నాలుగు మేకలను చంపేసినట్లు గుర్తించి గ్రామస్తులకు తెలియజేశాడు. మేకల విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని, ప్రభుత్వమే తనని ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేస్తున్నాడు.

చలో గన్‌పార్క్‌కు తరలిరండి

చేవెళ్ల: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని నిర్వహిస్తున్న చలో గన్‌ పార్క్‌ మహాధర్నాను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం చేవెళ్ల పార్లమెంట్‌ ఇన్‌చార్జి యాలాల మహేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22న ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చల్‌ గన్‌ పార్క్‌ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. మొయినాబాద్‌లో ఉద్యమ అమరుడు యాదిరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

25న 'చలో వేములవాడ'

మహేశ్వరం: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం తలపెట్టిన చలో వేములవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు వాడికల పాండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధి అమీర్‌పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ముందుకుసాగాలని సూచించారు. వేములవాడ వరకు నిర్వహించనున్న ర్యాలీకి భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, వి.సిద్దులు, శ్రీశైలం, శ్రావణ్‌, సత్యం, కుమార్‌ పాల్గొన్నారు.



మొయినాబాద్‌: విజయనగర్‌ కాలనీలో కోతకు గురైన అంతర్గత రోడ్డు



చెరువును తలపిస్తున్న చిలుకూరు-మొయినాబాద్‌ రోడ్డు

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకం

- వర్షాలకు దెబ్బతిన్న పలు రహదారులు
- తీవ్ర అవస్థలు పడుతున్న ప్రయాణికులు

మొయినాబాద్‌: మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. గ్రామాల లింకు రోడ్లతోపాటు కాలనీల్లో అంతర్గత రోడ్లు సైతం వర్షాలకు దెబ్బతిన్నాయి. ఈ రోడ్లపై వెళ్లేందుకు స్థానిక ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉన్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మొయినాబాద్‌ మున్సిపల్‌ కేంద్రంలోని విజయనగర్‌ కాలనీ, భరద్వాజ్‌ కాలనీ, స్టార్‌ కాలనీ, సహారా కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ మట్టి కొట్టుకుపోయి కోతకు గురయ్యాయి. వెంటనే వాటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా మున్సిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొయినాబాద్‌లో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట అమీర్‌గూడకు వెళ్లే రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పెద్దమంగళారం నుంచి చందానగర్‌ వెళ్లే రోడ్డులో అడుగడుగునా గుంతలు పడ్డాయి. పెద్దమంగళారం, చిన్నషాపూర్‌, చిలుకూరు, హిమాయత్‌నగర్‌, అజీజ్‌నగర్‌, ఎనికేపల్లి, ముర్తూజగూడ, సురంగల్‌ గ్రామాల్లో సైతం అంతర్గత రోడ్లు దెబ్బతిని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

చెరువులను తలపిస్తున్న లింకురోడ్లు

మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల లింకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. చిలుకూరు-మొయినాబాద్‌ లింకు రోడ్డుకు మూడేళ్ల క్రితమే నిధులు మంజూరైనా పనులు అసంపూర్తిగా ఉండటంతో రోడ్డుపై భారీగా వరద నీరు నిలుస్తుంది. ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లడం చాలా కష్టమైంది. నడుచుకుంటూ వెళ్లాలంటే నడుములోతు నీళ్లు నిల్చాయి. చిలుకూరు- పోలీస్‌స్టేషన్‌ రోడ్డులో సైతం వర్షం నీరు భారీగా నిలిచాయి. ఈ రోడ్ల పనులు చేపట్టకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు

మున్సిపాలిటీ పరిధిలోని చాలా కాలనీల్లో రోడ్లు సరిగా లేవు. ఇటీవల కురిసిన వర్షానికి మట్టి రోడ్లు కోతకు గురై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయాలని అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

– అరవింద్‌ రజక, బీఆర్‌ఎస్‌ యూత్‌ లీడర్‌, మొయినాబాద్‌

మరమ్మతులు చేయిస్తాం

భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని కాలనీల్లో రోడ్లు దెబ్బతిన్నాయని తెలిసింది. ఇంకా రెండు రోజులు వర్షాలు ఉన్నాయని అంచనా. వానలు తగ్గిన వెంటనే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయిస్తాం.

– ఖాజా మొయిజుద్దీన్‌, కమిషనర్‌, మొయినాబాద్‌

అడుగుకో గుంత

షాబాద్‌: మండల పరిధిలోని బోడంపహాడ్‌-మన్‌మర్రి గ్రామాల రోడ్డుపై అడుగుకో గుంతతో అధ్వానంగా మారింది. దీంతో రాత్రిపూట ఆ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే ప్రజలు జంకుతున్నారు. మండలంలోని అంతారం-మన్‌మర్రి, ఎల్గొండగూడ-వీరాపూర్‌ వరకు, పోతుగల్‌-మాచన్‌పల్లి వరకు, మల్లారెడ్డిగూడ-ఎర్రోనిగూడ, ఆస్పల్లిగూడ-చర్లగూడ వరకు వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో రాకపోకలకు అంతరాయం కలిగిస్తోంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ద్విచక్ర వాహనదారుల తిప్పలు

అంతారం స్టేజి నుంచి మన్‌మర్రి వరకు ఎల్గొండగూడ నుంచి వీరాపూర్‌ వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో గుంతలు వరద నీటితో నిండి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మన్‌మర్రి నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం షాబాద్‌, షాద్‌నగర్‌కు వెళ్తుంటారు. నిత్యం గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడంతో వెన్నునొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బురదమయంగా వీరాపూర్‌ రోడ్డు



అధ్వానంగా బోడంపహాడ్‌ బీటీ రోడ్డు

భయంగా ప్రయాణం

రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో రాత్రి వేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటే భయంగా ఉంటుంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. నేను రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోయాను.

-ఎండీ ఇనాయత్‌, బోడంపహాడ్‌, షాబాద్‌

గుంతలు పూడ్చాలి

అంతారం స్టేజి నుంచి మన్‌మర్రి వరకు రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డు ఉన్న గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించాలి.

– నర్సింహారెడ్డి, మన్‌మర్రి, షాబాద్‌

నేషనల్‌ స్టార్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డుకు ఎంపిక



అవార్డు అందుకుంటున్న శివకృష్ణగౌడ్‌

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌ గ్రామానికి చెందిన ఇండియా షోటోఖాన్‌ కరాటే మాస్టర్‌ శివకృష్ణగౌడ్‌ నేషనల్‌ స్టార్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డుకు ఎంపికయ్యాడు. ఆదివారం ఏపీలోని విజయవాడ నగరంలో వైఎంకే అకాడమి ఆధ్వర్యంలో గుజ్జల సరళదేవి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. వైఎంకే అకాడమి మాస్టర్‌ రూపస్‌పాల్‌ సినీహీరో భానుచందర్‌ చేతుల మీదుగా మెడల్‌, సర్టిఫికెట్‌ అందుకున్నట్లు శివకృష్ణగౌడ్‌ తెలిపారు.

పాఠశాలకు బెంచీల వితరణ



బెంచీలను అందజేస్తున్న ట్రస్ట్‌ ప్రతినిధులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హైదరాబాద్‌లోని ఓ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో బెంచీలను ఆదివారం అందించారు. సికింద్రాబాద్‌ జూనియర్‌ ఛాంబర్స్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ బెంచీమార్క్‌ త్రీ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాలకు చైర్మన్‌ నాగశ్రీధర్‌ 40 బెంచీలను అందజేశారు. విద్యాభివృద్ధికి చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్‌ మాజీ చైర్మన్‌ కమలాకర్‌ ముత్యాలు, ప్రధానోపాధ్యాయులు చక్రధర్‌రావు, మల్లికార్జున్‌, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నప్ప, రాజకుమార్‌ రెడ్డి, రవి కుమార్‌, లావణ్య, కవిత, వినీత్‌ తదితరులు పాల్గొన్నారు.

యజుర్వేద పారాయణ కరపత్రాల ఆవిష్కరణ



చౌదరిగూడలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

కొందుర్గు: చౌదరిగూడ ఆర్య సమాజంలో శ్రావణ మాసంలో నిర్వహించనున్న యజుర్వేద పారాయణ యజ్ఞం కరపత్రాలను సభ్యులు ఆదివారం విడుదల చేశారు. సమాజహితం కోసం గత 45 ఏళ్లుగా ఆర్య సమాజం ఆధ్వర్యంలో యజుర్వేద పారాయణ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఆగస్టు 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు యజ్ఞం చేపడుతున్నామని సంఘం ప్రతినిధి మచ్చ సుధాకర్‌రావు వివరించారు. యజ్ఞబ్రహ్మలుగా అరవింద్‌శాస్త్రీ, వసుదాశాస్త్రీలు వ్యవహరిస్తారని, ఆకారపు సుమతమ్మ, యాదగిరి దంపతులు భక్తులకు భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీ సంక్షేమ సంఘం ఎన్నిక

కందుకూరు: బీసీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆదివారం సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను నూతన కమిటీకి అందజేశారు. అధ్యక్షుడిగా బండ అంజనేయులు, ఉపాధ్యక్షులుగా ఇంద్రకంటి రవీందర్‌గౌడ్‌, డేరంగుల శ్రీరాములు, శ్రీనివాస్‌గౌడ్‌, బొడ్డుపల్లి రవి, ప్రధాన కార్యదర్శులుగా జంగయ్య ముదిరాజ్‌, బాల్‌రాజ్‌, దామోదర్‌గౌడ్‌, కోశాధికారిగా శ్రీనివాస్‌, సహాయ కార్యదర్శులుగా శేఖర్‌గౌడ్‌, కాళిదాసుచారి, బాబు, మహేందర్‌, శ్రీనివాస్‌చారి, ఎ.రమేష్‌గౌడ్‌, బి.రమేష్‌గౌడ్‌, నర్సింహ, ఎగ్గిడి కృష్ణ, నరేష్‌, వెంకటేశ్‌, జంగయ్య, రామకృష్ణ యాదవ్‌, శ్రీనివాస్‌ ముదిరాజ్‌, సురేందర్‌, ప్రచార కార్యదర్శులుగా వెంకటేశ్‌ గౌడ్‌, యాదయ్య ముదిరాజ్‌, లింగం యాదవ్‌, యాదయ్య, సీహెచ్‌ రవీందర్‌, అందె జైపాల్‌, బండ శ్రీను, మల్లేశ్‌, శంకర్‌, నర్సింహ, శివశంకర్‌, వరికుప్పల రాజు, ఢిల్లీ కృష్ణ, జగదీష్‌, సలహాదారులుగా బి.వెంకటేశ్‌, దేవేందర్‌, ఎస్‌.అంజయ్య, పి.వెంకటేశ్‌, ఎమ్మ అంజయ్య కుర్మలను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆర్‌.కృష్ణయ్య తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.



నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్‌.కృష్ణయ్య

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్‌: దక్షిణ తెలంగాణలో ప్రఖ్యాతిగాంచిన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కడ్తాల్‌ మండలం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు, వేద పండితులు మంత్రోచ్చారణలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేయగా.. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, ఈఓ స్నేహలత, తహసీల్దార్‌ జ్యోతి, కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్‌, సింగిల్‌విండో డైరెక్టర్‌ వెంకటేశ్‌, నాయకులు అరుణ్‌కుమార్‌, యాదగిరిరెడ్డి, లక్ష్పతినాయక్‌, జవహర్‌లాల్‌, హీరాసింగ్‌ రామకృష్ణ, భూపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌, శేఖర్‌గౌడ్‌ ఉన్నారు.



కడ్తాల్‌: అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

స్వయం ఉపాధిపై దృష్టి

ఆమనగల్లు: యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి, ఆర్థికంగా రాణించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో ఓ యువకుడు ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లయ్య, రాకేశ్‌, రాములు, జగన్‌, కేశవులు, మానయ్య, ఖాదర్‌ఖాద్రీ, శ్రీశైలం, కృష్ణనాయక్‌, బాబా, నర్సింహ తదితరులు ఉన్నారు.



చేవెళ్ల: బాలాజీ నగర్‌లో బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే కాలె యాదయ్య



షాబాద్‌: హైతాబాద్‌లో పోతురాజుల విన్యాసాలు

ఆషాఢమాసం.. బోనాల వైభవం

తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆషాఢమాసంలో భాగంగా గ్రామ దేవతల ఆలయాలను సుందరంగా అలంకరించారు. చేవెళ్ల, షాద్‌నగర్‌ నియోజకవర్గాల్లో మహిళలు ఉదయం నుంచే సంప్రదాయ దుస్తులు ధరించి, నెత్తిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని అమ్మవారిని భక్తులు కోరుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్‌



చేవెళ్ల: శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాల ఊరేగింపు



షాబాద్‌: సర్దార్‌నగర్‌లో బోనాల ఊరేగింపు



షాబాద్‌: చర్లగూడలో బోనాలతో మహిళలు



షాద్‌నగర్‌రూరల్‌: భీమారం ఊరేగింపులో..



షాద్‌నగర్‌రూరల్‌: చెర్నకోలతో ఎమ్మెల్యే శంకర్‌



చేవెళ్ల: పోచమ్మ బోనాలు



షాద్‌నగర్‌: ఆలయం వద్ద ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



మొయినాబాద్‌రూరల్‌: అమ్డాపూర్‌లో..



షాద్‌నగర్‌: దేవాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



శంకర్‌పల్లి: ఊరేగింపులో మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్‌



మొయినాబాద్‌రూరల్‌: శివసత్తుల పూనకాలు